డబ్బును హరిస్తున్న దాని శ్వాసను అంతం చేద్దామన్న ఆలోచన కలిగింది కోటమ్మకు. కాని యిది చాలా జాగ్రత్తగా చెయ్యాల్సిన పని.

మెల్లిగా ముసిలిదాని దగ్గరకెళ్ళి 'నువ్వు దయ్యాల్ని చూచావా?' అనడిగింది.

'లేద'ని నూతిలోంచి వెలువడ్డ శబ్దాల్లా కోటమ్మకు వినిపించాయి.

ఆ ముసిలిదాన్ని బెదరగొట్టడానికి, ఉన్నవీ లేనివీ కల్పించి దెయ్యాల కథలు చెప్పింది. చచ్చే ముందు అందరికీ కుండ నెత్తిన పెట్టుకుని, చేతులో చీపురుతో, గావు కేకలతో తప్పక దయ్యం ప్రతీవాళ్ళకూ కనపడుతుందని చెప్పింది. ఆ దెయ్యం కనబడ్డాక, ఆ మనిషి చచ్చిపోడానికి కొద్ది నిముషాలు వ్యవధి మాత్రం ఉంటుందని కూడా చెప్పింది. చచ్చేముందు ఆ దయ్యాన్ని చూసినవాళ్ల పేర్లుకూడా చెప్పింది, తను పట్టిన కేసుల్లోంచి, - రామయ్యగారు, సుబ్బమ్మగారూ వాళ్లూనూ! కోటమ్మ మాటలు ముసిలిదానికి తల కెక్కాయి.

తొందరగా కోటమ్మ వంటిట్లో కెళ్లింది— పాత గుడ్డ బుర్రమీద కప్పుకుంది. కుండనెత్తిన పెట్టుకుని, ముందుగా చప్పుడయేట్టుగా ఒక కాళీ డబ్బా ఎత్తేసి, చేతిలో చీపురుకట్టతో ముసిలి దానికెదురుగా తలుపుదగ్గర నిలబడి గావుకేకలు వేసింది. తర్వాత అరుస్తూ ముసిలిదానివేపు అడుగులు వెయ్యటం మొదలెట్టింది.

విన్న కబుర్లు దృశ్యరూపం దాల్చడం చూసే సరికల్లా ముసిలిదానికి మతిపోయింది. లేచి పారిపోడానికి కూడా ఓపిక లేని స్థితిలో ఉందేమో తమాయించుకోలేక వెనక్కి పక్కమీద పడిపోయింది - ప్రాణవాయువులు అనంతాకాశంలోకి వదిలేసింది.

కుండా, చీపురూ, గుడ్డా, డబ్బా వాటివాటి స్థలాల్లో పెట్టేసి వచ్చింది కోటమ్మ. తన చాకచక్యమంతా వినియోగించి కొయ్యబారిన ముసిలిదాని మిడిగుడ్లు రెప్పలమధ్య దాచేసి, తీర్థపు పంచపాత్ర తలవేపున పెట్టి విచారంగా కూర్చుంది.

సంధ్యవేళ చంద్రయ్య వచ్చాడు. కోటమ్మ విచారంగా ఉండడం చూసి సంగతి గ్రహించాడు. మొదటి బేరం ప్రకారం, అప్పటికి కోటమ్మ మూడు పగళ్లూ, ఒక రాత్రీ గడపడం చేత, ఐదు రూపాయలతో సరిపోయివుండేది. కాని తను అతి తెలివిగా కంట్రాక్టు కిచ్చి ఒక రూపాయి పోగొట్టుకున్నాడు. కోటమ్మకు ఒక రూపాయి లాభమే కలిగింది. తల్లి చచ్చిపోయిందన్న విచారంకన్నా, ఒక రూపాయి నష్టపడడంవల్ల కలిగిన దిగులు చంద్రయ్యను క్రుంగదీసింది కొన్నాళ్లబాటు.

(మూలం : మపాసా)

# ఆదర్శవంతుడైన అహింసావాది

"అమరశ్రీ"

కూర్మారావు ఈమధ్య మాఊళ్ళో ఒక విప్లవం లేవదీశాడు. నిజంగా అతనిది విప్లవ పంథా కాకపోయినా, మనిషిలో ఏమాత్రం చురుకుదనం లేకపోయినా అతను చేసిన పనుల ద్వారా గానీండి, అతనే గానీండి, ఒక చిన్న విప్లవాన్ని పుట్టించి వదిలాడు.

కూర్మారావు మూడుమూర్తులా గాంధీగారిని పోలిఉంటాడు. కాళ్ళకు ఆదేరకం జోడు, కళ్ళకు సులోచనాల జోడు. మోకాలుపైకి ఒక చిన్న అంగవస్త్రం, బుజాన మరొకటి, చేతిలో ఒకటో అరో పుస్తకాలు తప్పకుండా ఉంటయ్. మరి బొడ్లో పాకెట్ వాచీ ఉన్నదో లేదో నాకుమాత్రం తెలీదు. ఇదీ ఆయన వేషం.

వేషంచూస్తేనే నిజంగా గాంధీగారు జ్ఞాపకం వస్తాడు. సిద్ధాంతాలు సైతం అవే. 'గాంధీగారిని తు, చ, తప్పకుండా అనుసరిస్తున్నా' నంటాడు. 'అహింసా పరమోధర్మః' అని నిద్రలో మధ్యమధ్య కలవరిస్తూ ఉంటాడని ఈ మధ్య ఊళ్ళో నీలివార్తలు. మూర్తీభవించిన శాంతమూర్తిలా నడుస్తాడు. ఎదురొస్తే నిజంగా

చెయ్యెత్తి దండం పెట్టాలనిపిస్తుంది. అటువంటి కూర్మారావు మాఊళ్ళో విప్లవబీజాలు నాటాడంటే నమ్మరేమో అహింసావాదులు.

ప్రారంభం, ఆయన మాలపల్లికి వెళ్ళి భోజనం చేసిన రోజునుండి. ఆయన ఇంటిదగ్గర స్నానం చేసి కూర్చున్నాడు. మాలపల్లెనుండి వచ్చారు కొందరు జాతీయవాదులు. వెంటనే ఈయన్ని వెంటబెట్టుకొని మాఊళ్లో ఉన్న వీధులన్నీ కలయబెట్టి చల్లగా మాలపల్లె చేరాడు. కూర్మారావు మహాశయులు బుడ్డిచెంబుతో నీళ్లుపట్టుకొని అంగవస్త్రం చుట్టుకొని మాలపల్లెకి భోజనానికి పోవటాన్ని చూసి సోడాకొట్టు దగ్గర మధ్యాహ్నంపూట సిగరెట్లు ఊదుకొనే యువకుల దగ్గర్నుంచి ఊరి పెత్తందార్ల వరకూ గుడ్లుతేలేసి చూశారు. ఆడవాళ్ళ సంగతి ఇంక వేరే చెప్పాలా? కూర్మారావుగారి త్యాగశీలతను మెచ్చుకోని ఆడపిలేదు. అదీగాక వాళ్లందరూ శీలవతులూ, మానవతులూను. అటువంటివాళ్లు ఆయనవంక ఆశ్చర్యంగా, గౌరవంగా చూశారూ అంటే మనబోటివాళ్లు ఆలోచించకుండానే కళ్లు మూసుకొని గౌరవించాలి. ఆ విధంగా ఊరంతా ఎందుకు తిరిగాడు భోజనానికి పోయేవాడు పోక, అంటారేమో? ఈయనను తీసుకొనిపోవటానికి వచ్చినవాళ్లకి ఊళ్లో ఏదో పని ఉంది. అందుకోసం దాదాపు కూర్మారావుని ఊరేగింపు చేయవలసి వచ్చింది.

ఆ విధంగా, మా ఊరి వినాయకుడు ఊరేగినట్లు, ఊరేగాడు. అందరూ తను భోజనానికి వెళ్లాడన్న విషయాన్ని గమనించారనే నమ్మకం కలిగిన తరువాతనే మాలపల్లె జేరాడంటే కూర్మారావులాంటి దేశభక్తులు, నిరాడంబర జీవులు నమ్మక పోవచ్చు. నమ్మించాలనే కుతూహలం నాలో చచ్చిపోయిందంటే, వింతేమీ లేదు. కూర్మారావుగారి 'ఇన్ఫ్లుయన్స్' అవంతా. హాతోస్మి! ఇంగ్లీషు పదాలు వాడకూడదు కాబోలు, 'ఇంగ్లీషు' అనే పదమే ఆంగ్ల పదం. దానికి సరియైన హిందీపదం రావటంలేదు, నేను ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణుండనయినాకూడా.

అప్పటికే మా ఊళ్లో విప్లవ బీజాలు చల్లినంత పనయింది. కూర్మారావుగారి అహింసాపరత్వమూ, నిరాడంబరత్వమూ, పరోపకారపారీణత, దేశ సేవా పరాయణత, మా ఊళ్లో ఏ మూల చూసినా కనుపించ సాగినయ్. మా గ్రామవాసులు మాత్రం, కూర్మారావును చూసి నేర్చుకోవాలనే స్థితికి వచ్చారు. ఇదంతా ఎందుకు? కూర్మారావు మా గ్రామాన్ని పునరుద్ధరించాడు. పునరుద్ధరించాడని ఎందుకంటున్నానంటే మా ఊరి సంస్కృతీ పునరుద్ధారకులు అంటున్నారు—మా ఊరే వెనక ఓ గొప్ప రాజ్యానికి రాజధాని అని. కూర్మారావు మా గ్రామానికి ఒక ఆదర్శ పురుషుడయినాడు. మా గ్రామం ఇంతవరకూ నలుగురి నోళ్ళలో పడ్డది అంటే, అదంతా అతని చలవే ననాలి.

ఇవన్నీ అటుంచి మా ఊళ్లో ఒక 'కాకిగోల' ప్రారంభమైంది ఒక ప్రక్కనుండి. నరసయ్యగారంటే మా ఊళ్లో తెలియని వాళ్ళెవరు. ఎక్కడ సత్యనారాయణ వ్రతం జరిగినా, శ్రాద్ధకర్మ జరిగినా ఆయనదే పౌరోహిత్యం. ఆయన కొడుకు మాలపల్లెలో భోజనం చేశాడనగానే ఆయనకు ఒకవిధమైన గొప్పతనమూ, తక్కువతనమూ వచ్చాయి.

ఆ రోజులలో ఎవరిపీ శ్రాద్ధ కర్మలు జరుగలేదుగాని సత్యనారాయణ వ్రతాలు జోరుగా సాగినయ్. మా ప్రక్క ఊరి కొండయ్యగారే చేయించారు దివ్యంగా అన్నింటినీ. నరసయ్యగారికి 'మార్కెటు' పడిపోయింది. కూర్మారావు చేసిన పనే దానికి కారణమన్నారు మా తాతగారి స్నేహితులు కొందరు.

నరసయ్యగారు కట్టిస్తూన్న డాబా సగంలోనే ఆగిపోయింది. దానికంతకూ కారణం ఎవరు? కూర్మారావేనని నరసయ్య అభిప్రాయం కాని నరసయ్యకు చేతగాదు కూర్మారావులా ప్రజలను ఆకర్షించటం. అందుచేతనే తప్పంతా కూర్మారావు మీదికి నెట్టి ఊరుకున్నాడు.

మా ఊళ్లో నరసయ్యగారి కుటుంబం తప్ప మరో బ్రాహ్మణకొంపలేదు. ఈ పరిస్థితి కొంత వరకు 'గుడ్డిలో మెల్లలా' ఉన్నది. నరసయ్య తృప్తి పడ్డాడు వెలివేసేవాళ్ళు లేరుగదా అనుకొని.

నన్నొకడు కొట్టాడూ అని నరసయ్యతో చెపితే, వాడు నిన్ను చంపేవాడేమో, చంపనందుకు సంతోషించమంటాడు. అందుచేతనే

ఊళ్లో వాళ్లు చేసేపనికి ఏదవలేదు. 'చచ్చినవాడి పెళ్ళికి వచ్చిందే చాలు'ననుకునే రకం.

గురవారెడ్డి తండ్రి చచ్చిపోయాడు. గురవారెడ్డి ధైర్యం చేసి నరసయ్యను శ్రాద్ధానికి పిలిచాడు. అప్పటినుండి శ్రాద్ధాలకు నరసయ్యనూ, శుభకార్యాలకు కొండయ్యనూ పిలుస్తున్నారు మా ఊరివారు, కూర్మారావును ఆదర్శంగా ఉంచుకున్న వాళ్ళుకూడా. అందులో ఉన్న 'మంచి' నాకు ఎంత మాత్రమూ అర్థం కాలేదు. నరసయ్యలోలేని 'శుభం' కొండయ్యలో ఎంత ఉన్నదో కూర్మారావుని ఉపాసించేవారికి తప్పకుండా తెలిసేఉండాలి. మొత్తం మీద నరసయ్యకు కొంత పలుకుబడి తగ్గింది. తగ్గటానికి కారణాలు కులమత తత్వభేదంలేని కూర్మారావు అనుచరులకే తెలియాలి.

అసలు విషయం చెప్పటం మరిచిపోయాను. కూర్మారావు ఈ సాహసకృత్యం చేసినతరువాత మాఊరు రెండు పక్షాలుగా చీలిపోయింది. ఆ విధంగా ఒక్కొక్క గ్రామాన్ని రెండుగా విభజించ ప్రయత్నించటం కూర్మారావు మతమే గాదు. పైగా గ్రామ సౌభాగ్యాన్ని పెంపొందించి గ్రామాన్నియావత్తూ జాతీయంచేయటమే ఆయన ఆశయం. అయినప్పుడు గ్రామం ఎందుకు చీలిక అయిందంటే, చేసినవాళ్ళకే తెలియాలి.

అప్పటికి కూర్మారావు నాటిన బీజాలు మొలకెత్తినయ్. నిజంగా అవి విప్లవ బీజాలు కావు. అహింసా సిద్ధాంతాలు. నిటారుగా నిలబడి, ఏ కోశానా వంకరుండా, శివిగా, ఏదో పెద్ద దేశాన్ని పునరుద్ధరిస్తున్నట్లు నడిచే కూర్మారావు అనుచరులను చూస్తే ఎందుకో 'మార్పు' వద్దనే వాళ్ళకి కోపం. కూర్మారావు ప్రవర్తనను నిరసించే వాళ్ళందరిమీద అనుచరులు కత్తి గట్టారు. కూర్మారావు అంగవస్త్రం మరికొంచెం పైకికట్టాడు,అహింసావాది అయినా సరేననుకుని.

మా ఊరి 'మార్క్సిస్టు' అభిప్రాయాలీ గొడవతో విడపడేలా లేవు. అయినా చూచాయగా తెలిశాయి. మార్క్సిస్టు దీనినంతా 'మదపిచ్చి' కింద జమకట్టాడు. మా ఊరికి ఒకడే ఒక మార్క్సిస్టు ఉండి, ఉండి ఒక్కసారి విజృంభించ సాగాడు. కూర్మారావుగారి అహింసా తత్వాన్ని, నిరాడంబరత్వాన్ని, బీడీలసాయిబు కొట్టుదగ్గరా, కాలవకట్టిన ఇసుక దిబ్బలమీదా, లైబ్రరీ అరుగులమీదా, కూర్మారావుని విమర్శించసాగాడు. విమర్శను నిశితంగా సాగించాడు.

భోజనానికి పోయేవాడుపోక ఊరంతా తిరగడమెందుకు? ఆయనలో ఎంత ఆడంబరత్వం ఉన్నదో అదే బుజువు చేస్తోందంటున్నాడు 'మార్క్సిస్టు'. కూర్మారావు అహింసావాదాన్ని ఖండించాడు. మాఊళ్లో రెండు పక్షాలవారికి జరిగిన దొమ్మీకి కారణం కూర్మారావే గనుక వాళ్లందరూ అహింసావాదులే కారన్నాడు.

కూర్మారావు అనుచరులూ, ప్రతికక్షులూ ఈ మధ్య లైబ్రరీముందు ఒకయుద్ధం చేసుకొన్నారు. అది ప్రపంచయుద్ధం క్రింద మారిపోయేదే కాని ఆగిపోవడానికి కారణం కూర్మారావుగారి అహింసాతత్వమే నన్నారు కొందరు జాతీయవాదులు, వాళ్లు కొట్టుకున్నంతసేపూ కూర్మారావు లైబ్రరీలోపలే ఉన్నాడు కాని బయటకు కన్నెత్తి చూసినపాపానపోలేదు. మరి ఆయన అహింసాతత్వం ఎలాఆపగలిగిందో అరయుద్ధాన్ని? ఆయనకే తెలియాలి. దాని నర్థంచేసుకో గలిగిన వాళ్ళకే తెలియాలి.

నాబోటి సామాన్యుడికి అనుమానాలుఅనేకం కలుగుతున్నయ్. కూర్మారావుగారిని విమర్శించిన 'మార్క్సిస్టును పోలీసువాన్‌లో ఎక్కించుకొని తీసుకొని పోతూంటే, ఇదంతా కూర్మారావులాటి అహింసా తత్వాన్ని విమర్శించటము వలననే కాబోలు ననిపిస్తోంది. నిజంగా అంతే, అదంతా అహింసాతత్వ ప్రభావం కాబోలునను కోవలసి వచ్చింది మాకు.

కాని ఏది నిజాయితీ, ఏది నిజాయితీ కాదో బోధపడే స్థితి కాదిది. 'లైబ్రరీ ముందు జరిగిన పోట్లాట, మార్క్సిస్టు ఖైదీకావటం, వీటన్నిటి కంటే ముందు కూర్మారావుగారు ఊరందరకూ తెలిసేలా వెళ్లి మాలపల్లెలో భోజనంచేసి నిద్రపోయే నీళ్ళలో గడ్డవేయటం – వీటన్నిటిలో ఎంతవరకూ హింసాకాండ ఇమిడి ఉన్నదో – కాదు, అహింసాకాండ ఇమిడి ఉన్నదో సామాన్యుడర్థంచేసుకోలేక పోతున్నాడు ఏది నలుపు, ఏది తెలుపు, అని తమ్ము తామే ప్రశ్నించుకోవలసి వస్తోంది.